# భం గురువాణి

మార్చి 20, 2025     సంచిక - 243



## శివునికి జీవునికి మధ్య వారధి సద్గురువే

ఆధ్యాత్మిక క్షేత్రంలో విప్లవ జ్యోతిని వెలిగించినటువంటి వాడు వేమనగారు. ఆయన అంటారు...

“ గురుని శిక్ష లేక గుఱుతెట్లు అబ్బునో
అజునికైన వానియబ్బకైన,
తాళపు చెవిలేక తలుపెట్లూడునో
విశ్వదాభిరామ వినుర వేమ”.

పుస్తకాలు చదివితే జ్ఞానమంతా రాదు. గురుముఖంగా చదివితేనే జ్ఞానం వస్తుంది అని అంటారు వేమనగారు.

ఉత్తర భారతదేశంలో ఆధ్యాత్మిక క్షేత్రంలో మహా



యోగిగా రాణించినవాడు కబీర్‌దాస్. ఆయన కూడ గురువు లేకుంటే ఏమీ సాధించలేరని అంటాడు. ఆయన మాటలలో " అయ్యా! నేను గురూపదేశం అనే రసం త్రాగినాను. వేరే రసంతో నాకు పని లేదని అంటాడు. రోమ రోమములలో గురూపదేశం నిండుకొని పోయింది. కాలిన కుండను కమ్మరి చక్రం మీద ఎక్కించలేడు. అదే రీతిగా ఇది కాలిపోయింది. ఇది జనన మరణములనెడి చక్రం నుంచి దూరంగా వెళ్ళిపోయింది. మళ్ళీ ఈ కబీర్ పుట్టడు" అని అంటాడు. ఇంతటి శక్తి రావడానికి కారణం గురువు ప్రసాదించి నటువంటి గొప్ప మంత్రము అని అంటాడు కబీర్. దీనినే వేమనగారు తన వేమన శతకంలో ఇలా వ్రాస్తాడు.

"మాటలుడగుకున్న మంత్రంబు రాదు,

మంత్రంబు రాకున్న మనసు నిలువదు,

**మనసు నిలుపకున్న మరి ముక్తి లేదయా**
**విశ్వదాభిరామ వినురవేమ".**

దీనికంటే ఘాటుగా కబీర్‌దాస్ ఇలా అంటాడు.

**"నామ్ బినా బే కామ్ హై ఛప్పన్ కోటిబిలాస్**
**కాఇంద్రా నమ బైఠివోకా వైకుంఠనివాస్ "**



గురువు యొక్క మంత్రము లేకుంటే 56 కోట్ల వైభవములు నిష్ప్రయోజనము అని అంటాడు. గురువు యొక్క నామానికి, గురు మంత్రానికి ఇంద్రాసనం స్వర్గం మొదలగు వైభవాలన్నీ ఏమాత్రం సరితూగవు.

*కనుక శిష్యభక్తాదులారా!* ఆధ్యాత్మిక క్షేత్రంలో ముందుకు సాగాలంటే గురువు ఇచ్చిన మంత్రం, గురు నామం అత్యవసరం.

ఆధ్యాత్మిక క్షేత్రంలో శివునికి –జీవునికి,

భగవంతునికి–భక్తునికి మధ్య వారధిగా సద్గురువు ఉంటాడు. కనుక మీరందరూ కూడ ఒక సద్గురువుని ఆశ్రయించి గురు మంత్రమును పొంది ఆ పవిత్రమైన గురు మంత్ర సాధనలో ఆధ్యాత్మిక క్షేత్రంలో ముందుకు సాగగలరని ఆశిస్తూ ఆశీర్వదిస్తున్నాను.



శ్రీశ్రీ సద్గురు బాబా అన్వరానంద వారివేదాంతోపన్యాసము నుండి గ్రహింపబడినది.